క్లుప్తంగా

అందరికీ నిత్యావసరాలు అందిస్తాం

మంత్రి నాదెండ్ల మనోహర్



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): వరద ముంపు బాధితులకు నిత్యావసర సరుకులను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో కలిసి గుంటుపల్లిలో ఆదివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిట్టచివరి బాధితుడికి సైతం నిత్యావసరాలు అందిస్తామన్నారు. వ్యాపారులు తమ దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బాధితులకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు.

వరద బాధితుల వివరాల సేకరణ

మైలవరం: భారీ వర్షాలు, వరదలకు ముంపునకు గురైన బాధిత కుటుంబాల వివరాలను గ్రామ సచివాలయాల సిబ్బంది ఆదివారం సేకరించారు. మైలవరం ఆదాంపురం, చిన్న గూడెం, అయ్యప్ప నగర్, బాలయోగి నగర్‌లలో సచివాలయ సిబ్బంది పర్యటించి సమాచారం సేకరించారు. మైలవరం ఆదాంపురం ఏరియాలో 3వ నంబర్ గ్రామ సచివాలయం కార్యదర్శి భవానీ శంకర్, స్వాతి పర్యటించి స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. మిక్కిలి రఘు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దుప్పట్లు, చీరలు పంపిణీ



జి.కొండూరు: వరద ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల యజమానులు ముందుకు రావాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరు బీసీ కాలనీలో వరద ముంపు బాధిత కుటుంబాలను ఆదివారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా 300 మంది బాధిత కుటుంబాలకు దుప్పట్లు, చీరలు ఎంపీపీ సొంత నిధులతో పంపిణీ చేశారు. సర్పంచ్ మండల అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మరియమాత జన్మదిన వేడుకలు



తిరువూరు: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో నిత్య సహాయ మాత మరియతల్లి జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. పరిశుద్ధాత్మ ప్రభావంతో గర్భం దాల్చి లోక రక్షకుడు ఏసుక్రీస్తుకు నిష్కళంక మాత మరియ తల్లి జన్మనిచ్చారని చర్చి ఫాదర్ విజయకుమార్ అన్నారు. కేక్ కట్ చేసి సంఘస్తులకు స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం వాక్యోపదేశం చేశారు. మానవులను పాప విముక్తులను చేసి పరిశుద్ధ జీవితం వైపు నడిపించిన ఏసుక్రీస్తు తల్లిగా మరియమాత పూజ్యనీయురాలన్నారు. దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాద స్వీకరణ కార్యక్రమాలు జరిగాయి.

వారం రోజులుగా ముంపులోనే



ఆగిరిపల్లి: భారీ వర్షాలతో ఆగిరిపల్లిలో గన్నవరం రోడ్డులోని సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న వీధి ముంపునకు గురైంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరు ఇళ్ల మధ్యలో పెద్ద ఎత్తున నిలిచిపోయింది. మోకాలి లోతు నీటిలోనే స్థానికులు రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దోమల బాధ ఎక్కువై జ్వరాల బారిన పడుతున్నామని, పాములు కూడా సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. వారం రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షం నీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గణేశాయ.. నమోనమః

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా కొలువుతీరిన గణనాథులు



నూజివీడులో పూజలందుకున్న దుర్గా గణేషుడు



నూజివీడు ఎంప్లాయీస్ కాలనీలో గణనాథుడు



తిరువూరు గణేష్ సెంటర్లో గణపతి




తిరువూరు కేడీసీసీ బ్యాంకు వద్ద వినాయకుడు



మైలవరంలో కోట వెనుక ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం



తిరువూరు మధిర రోడ్డు ఇందిరా కాలనీలో గణనాథుడు



తిరువూరు రైస్‌మిల్ సెంటర్‌లో వినాయకుడు



మైలవరం మాదాసు కాలనీలో పూజలు



రమణక్కపేటలో గణనాథునికి పూజలు



ఆగిరిపల్లిలో పూజలు



ఊటుకూరులో పూజలందుకున్న గణనాథుడు

నూజివీడు: వినాయక చవితి వేడుకలు నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పండ్ల మార్కెట్ సెంటర్, ఎంప్లాయీస్ కాలనీ, శివాలయం సెంటర్, బొండిలిపేట గంగానమ్మ గుడి, రామాయమ్మరావుపేటలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద, మొఘల్ చెరువు వద్ద, నాగవిఘ్నేశ్వరాలయం, గాంధీనగర్, శ్రీనివాస సెంటర్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, గొడుగువారిగూడెం, ఢంఢం గార్డెన్ రోడ్డు, కోనేరుపేట టీటీడీ కల్యాణ మండపం, నందనంతోట, మైలవరం అప్పారావు షెడ్డు, ముసలి రామమందిరం తదితర చోట్ల గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. మండలంలోని గ్రామగ్రామాన వినాయక చవితి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

- ముసునూరు: మండల వ్యాప్తంగా 76 వినాయక నవరాత్రి పందిళ్లు ఏర్పాటు చేశారు. రమణక్కపేటలో ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావు దంపతులు, లోపూడి, గోపవరంలలో వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయా మండపాల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజాదికాలు నిర్వహించారు.
- మైలవరం: మైలవరంలోని నూజివీడు రోడ్డు, కోట వెనుక కాలనీ, మాదాసు కాలనీలలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పందిళ్లు వేసి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
- తిరువూరు: తిరువూరు మండలంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తిరువూరు పట్టణంలోని రాజుపేట పాత ఏడీబీ సెంటర్, చీరాల సెంటర్, గణేష్ సెంటర్, కేడీసీసీ బ్యాంక్ వద్ద, మధిర రోడ్ ఇందిరా కాలనీ, రైస్‌మిల్ సెంటర్, బైపాస్ రోడ్డు విఘ్నేశ్వరాలయం, షిర్డీ సాయి మందిరాలలో గణపతి నవరాత్రి పందిళ్లు వేసి పూజాదికాలు నిర్వహించారు. సిద్ధిబుద్ధి సమేత గణపతిని వివిధ రూపాల్లో అలంకరించి విశేష అభిషేకాలు, సహస్ర నామార్చనలు చేశారు.
- గంపలగూడెం: గంపలగూడెం గాంధీసెంటర్, కాపులవీధి, రెడ్డిబజారు. పటమట దళితవాడ, తోటమూల వై-జంక్షన్, పొండ్రీ సెంటర్‌లో, పెనుగొలను, ఊటుకూరు, కొణిజెర్ల, నెమలి, గోసవీడు, వినగడప, తునికిపాడు, అనుముల్లంక, కనుమూరు తదితర గ్రామాల్లో చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు ఇండ్ల వద్ద చిన్న వినాయక ప్రతిమలు నెలకొల్పి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.
- విస్సన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేక అలంకరణలతో వినాయకుడి పందిళ్లు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద వినాయక చవితి వేడుకలు జరిగాయి.
- చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.
- ఆగిరిపల్లి: స్థానిక రజక వీధిలో చిన్నారులు వినాయకుని విగ్రహం నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు. వేద శాస్త్ర పాఠశాలలో మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహం ఆకట్టుకుంది. ఆదివారం బ్రహ్మశ్రీ చల్లపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కృష్ణ యజుర్వేద సంపూర్ణ పారాయణం నిర్వహించారు.

మళ్లీ పొంగుతున్న వాగులు



కొత్తగూడెం వద్ద ఉప్పవాగులో వరద ప్రవాహం



చిలుకూరు సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

తిరువూరు: తుపాను ప్రభావంతో తిరువూరు డివిజన్‌లో శనివారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని మల్లేల-లక్ష్మీపురం గ్రామాల మధ్య, మునుకుళ్ల-వావిలాల, తిరువూరు-కోకిలంపాడు, చౌటపల్లి-జీకొత్తూరు గ్రామాల మధ్య వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రించారు. తిరువూరు పట్టణ ప్రధాన రహదారిలో బైపాస్‌రోడ్డు విఘ్నేశ్వరాలయం నుంచి ఎల్‌ఐసీ కార్యాలయం వరకు వర్షం నీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల డ్రెయినేజీల పూడిక తీసినప్పటికీ వర్షం నీరు పోయే మార్గం లేక రోడ్డుపైనే నిలిచిపోయింది. ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షం నీరు నిలిచిపోయి ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. తిరువూరు మండలంలో 10 సెంటీ మీటర్లు, గంపలగూడెంలో 6.3, విస్సన్నపేటలో 4.5, ఎ.కొండూరులో 3.4, రెడ్డిగూడెం మండలంలో 2.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రైతులకు అపార నష్టం

ఖరీఫ్ వరి పంట నీటమునగడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. మండలంలోని మునుకుళ్ల, కోకిలంపాడు, అక్కపాలెం, లక్ష్మీపురం, చిట్టేల, టేకులపల్లి, ఆంజనేయపురం గ్రామాల్లో రెండు వేల ఎకరాలకు పైగా వరిపైరుకు నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు.

చాట్రాయిలో భారీ వర్షం

చాట్రాయి: చాట్రాయి మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కొత్తగూడెం, యర్రవారిగూడెం గ్రామాల మధ్య ఉప్పు వాగు వరదతో ఉధృతంగా ప్రవహిస్తోంది. చనుబండ, నరసింహారావుపాలెం గ్రామాల మధ్య రేగడి వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలకు చనుబండ గ్రామానికి చెందిన గత్తం ఇస్తయ్య ఇంటి గోడ కూలిపోయింది. మండలంలో 3.02 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు.

- విస్సన్నపేట: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కలగర గ్రామంలో కుండపాలెం చెరువు అలుగు పడటంతో రహదారిపై నీరు ప్రవహిస్తోంది. నరసాపురం గ్రామం వద్ద, చంద్రుపట్ల- తెల్లదేవరపల్లి గ్రామాల వద్ద రేగటి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పుట్రేలలో మారెమ్మ దేవస్థానం వద్ద ప్రధాన రహదారిపైగా వర్షం నీరు ప్రవహిస్తోంది.

వరద నీరు మళ్లింపు

చాట్రాయి: మండలంలోని చనుబండ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం వరద నీటిని మళ్లించారు. సూరంపాలెం గ్రామంలో నీరు గృహాల్లోకి వెళ్లకుండా జేసీబీతో బయటకు మళ్లించారు.

మళ్లీ ఉప్పొంగిన ఏనుగుగడ్డ వాగు

ఇబ్రహీంపట్నం: ఏనుగు గడ్డ వాగు మళ్లీ ఉప్పొంగి ప్రవహిస్తోంది. గత నెల 31న ఒకసారి వాగు పొంగి ప్రవహించింది. వారం రోజుల వ్యవధిలోనే రెండో సారి ఉప్పొంగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వాగు ప్రభావంతో చిలుకూరు సమీపంలో రోడ్డుపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. చిలుకూరు, దాములూరు, కొత్తపేట గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మూలపాడు, జూపూడి, కిలేశపురం వద్ద సప్టాలపై సుమారు నాలుగు అడుగుల మేర నీటి ప్రవాహం ఉండటంతో చినలంక, పెదలంక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో భారీగా నీటిమట్టం పెరిగింది.

పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి

తహసీల్దార్ రాజ్‌కుమార్



చెక్కపల్లిలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

ముసునూరు: ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు సహాయ పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి చెక్కపల్లి పెద్ద చెరువు కట్టను, హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. చెక్కపల్లిలోని పెద్ద చెరువు కట్ట దిగువ ప్రాంతంలోని ప్రజలను సహాయ కేంద్రానికి తరలివెళ్లాలని కోరారు. శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సూరేపల్లి, బాసవరప్పాడు వాగుల్లోని వరద నీరు వచ్చి పెద్ద చెరువులో కలవడంతో, దానిలో వరద ఉధృతి పెరిగి, కట్టకు గండి పడే పరిస్థితి ఏర్పడిందని ప్రజలను అప్రమత్తం చేశారు. అక్కిరెడ్డిగూడెం తోటల్లో నీరు నిల్వ అధికంగా ఉండడంతో జేసీబీ ద్వారా నీటిని తొలగించాలని కార్యదర్శి విద్యాధర్‌ను ఆదేశించారు. స్థానిక సర్పంచ్‌లు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద ఉధృతి పరిశీలన..

ముసునూరు: మండలంలోని కొర్లగుంట, నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామాల మధ్య రామిలేరు వంతెన వరద ఉధృతిని అధికారులు పరిశీలించారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నూజివీడు పెద్ద చెరువు, ముక్కొల్లుపాడు చెరువులకు గండ్లు పడడం, చిన్నా చితకా వాగుల్లో నీరు, పొలాల్లోని సర్దు వచ్చి, రామిలేరులో కలవడంతో ప్రవాహ ఉధృతి పెరిగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి మళ్లీ రామిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొర్లగుంట గ్రామ సచివాలయ కార్యదర్శి రాకేష్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.రాణి, కార్యాలయ ఏఓ సాయిరాము, సన్నీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు వరద ఉధృతిని పరిశీలించారు. వరద ఉధృతి పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రయాణికుల రాకపోకల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శిని ఆదేశించారు.

ఆపద సమయంలో అండగా



విజయవాడలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎన్టీటీపీఎస్ ఇంజనీర్ మనోహర్



హెచ్. ముత్యాలంపాడులో నిత్యావసరాలను అందజేస్తున్న కాజా బ్రహ్మయ్య

ఇబ్రహీంపట్నం: విజయవాడ రాజరాజేశ్వరిపేటలోని వరద ముంపు బాధితులకు ఎన్టీటీపీఎస్ ఇంజనీర్ మనోహర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి నిత్యావసర సరుకులు, పాలు, తాగునీరు పంపిణీ చేశారు. కొండపల్లి డీఏవీ పాఠశాల ఆధ్వర్యంలో ఈలప్రోలు, విజయవాడ వైఎస్సార్ కాలనీలో బాధితులకు ఆహారం ప్యాకెట్లు, బిస్కెట్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.

- జి.కొండూరు: హెచ్. ముత్యాలంపాడులో వరద ముంపు బాధిత 500 కుటుంబాలకు మాజీ జెడ్పీటీసీ కాజా బ్రహ్మయ్య, ఆయన సతీమణి సర్పంచ్ కాజా సంధ్యారాణి తమ సొంత నిధులతో నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సున్నంపాడులో చోరీ



నిందితుడు బండా సంపత్ (ఫైల్)



చోరీ జరిగిన నివాసంలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

జి.కొండూరు: జి.కొండూరు మండలం సున్నంపాడు గ్రామంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. సున్నంపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాసీం, షేక్ ముస్తఫా అన్నదమ్ములు. వీరికి ఎదురెదురుగా రెండు ఇళ్లు ఉన్నాయి. శనివారం రాత్రి భోజనం అనంతరం ఖాసీం కుటుంబం తమ్ముడు ముస్తఫా కుటుంబంతో కలిసి ముస్తఫా ఇంట్లో పడుకున్నారు. ఆదివారం ఉదయం ఖాసీం కుటుంబం తాము నివాసం ఉంటున్న ఇంట్లోకి వెళ్లి చూడగా ఇనుప బీరువాను పగలగొట్టబడి బట్టలు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని రూ.80 వేలు నగదు, ఎనిమిది గ్రాముల బంగారం, 23 తులాల వెండి నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. జి.కొండూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్ఐ కె. సతీష్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు.

నిందితుడి గుర్తింపు

క్లూస్ టీం సేకరించిన వేలి ముద్రల ఆధారంగా నిందితుడు తెలంగాణ రాష్ట్రం, మంచిర్యాల జిల్లా ఖాసీపేట మండలం సోమగూడెం గ్రామానికి చెందిన బండా సంపత్‌గా పోలీసులు గుర్తించారు. ఇతనిపై ఏపీలో కూడా పలు చోరీ కేసులు నమోదైనట్లు తెలిసింది. నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.5 వేలు రివార్డును అందిస్తామని పోలీసులు ప్రకటించారు. ఆచూకీ తెలిసిన వారు జి.కొండూరు ఎస్ఐ సెల్: 9440796448, మైలవరం సీఐ సెల్: 8332983805 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ప్రణాళిక ప్రకారమే వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్ట్

ఇబ్రహీంపట్నం: సీఎం చంద్రబాబు ఇంటిపై గతంలో దాడి చేశారనే ఆరోపణలతో ఇబ్రహీంపట్నానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. అరెస్ట్‌లపై అధికారిక ప్రకటన లేకపోవడం నాయకులను ఆందోళనకు గురిచేస్తోంది. ఆదివారం ఇద్దరు నాయకులను అరెస్ట్ చేసి తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మూడు రోజుల కిందట ఫెర్రీకి చెందిన నలుగురు వైఎస్సార్ సీపీ నాయకులను తాడేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. తాడేపల్లి దాడి అంశానికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో మండలానికి చెందిన కొంతమంది పేర్లతో పాటు వగైరాలు అని నమోదు చేశారని చెబుతున్నారు. ప్రణాళిక ప్రకారం ప్రధాన నాయకులపై దృష్టి పెట్టి వగైరాలు పేరుతో కావాలని అన్యాయంగా అరెస్ట్ చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. వీరి అరెస్టులను ప్రజలు ఖండిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామం అశోక్‌నగర్‌లో ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వరదల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా, సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా వైద్యశిబిరం ఏర్పాటు చేశామని డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్ తెలిపారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామని, సోమవారం కూడా వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు.

13న దుకాణాల లీజు వేలం

తిరువూరు: స్థానిక మండల పరిషత్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి సత్రం ఆవరణలో దుకాణాలను అద్దెకు ఇచ్చే నిమిత్తం ఈ నెల 13న వేలం నిర్వహిస్తామని దేవదాయ శాఖ ప్రకటించింది. మూడేళ్ల కాల పరిమితికి ఈ ఏడాది అక్టోబర్ ఒకటి నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు దుకాణాలను అద్దెకు ఇచ్చే నిమిత్తం వేలం జరుగుతుందన్నారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు నిర్వహించే వేలంలో పాల్గొనదలచిన వారు కన్యకాపరమేశ్వరి సత్రం వంశపారంపర్య ధర్మకర్తను సెల్: 98481 60202 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మున్నేటికి పెరుగుతున్న వరద



నందిగామ టౌన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మున్నేటికి వరదనీరు క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి భారీగా వరదనీరు చేరుతుండటతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్నేటికి ఎగువ నుంచి 65 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని అధికారులు చెబుతున్నారు. వరద ప్రవాహం పెరిగితే విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ముంపునకు గురైన పంట పొలాలు



మైలవరం: మైలవరం మండలం వెల్వడం, చంద్రాల, గణపవరం, తోలుకోడు గ్రామాలలో పంట పొలాలను శనివారం వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం వరద నీరు పంట పొలాల్లో నిలిచింది. మండల వ్యవసాయ శాఖాధికారి సంధ్యారాణి స్పందిస్తూ రైతులు అవకాశం ఉన్న మేరకు పంట పొలాల్లో నిలిచిన నీటిని త్వరగా బయటికి పంపి, నీరు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలన్నారు. పిలకల దశలో ఎండాకు తెగులు, ఆకుముడత తెగులు వచ్చే అవకాశం ఉందని, పాముపొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా వాలిడామైసిన్ 1.0 మిల్లీ లీటర్లు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. మెట్ట పంటలైన పత్తి, అపరాలులో నీరు బయటికి తీసిన తరువాత 20 కిలోలు యూరియా, 10 కిలోలు పొటాష్ పైపాటుగా వేయాలన్నారు. వేరుకుళ్ల తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండిజమ్ ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీఎస్ తోయజాక్షుడు, వీఏఏలు పాల్గొన్నారు.